సంపుటి: 5 | సంచిక: 2

జనవరి - ఫిబ్రవరి, 2017

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



**నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును.**



# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

స్పర్శ పాఠకులకు ప్రభువునందు నూతన సంవత్సరపు శుభాకాంక్షలు. ప్రతి కుటుంబమును రక్షించి సమాధానముతో నడిపించాలని దేవునికి ఎల్లప్పుడూ నా ప్రార్థనయై ఉంది. మనకు అనుగ్రహించిన వాగ్దానము ప్రకారము దేవుడు మన మార్గములన్నింటిలో తోడై యుంటానని చెప్పడం జరిగింది. కనుక మనము దేనికీ భయపడక ముందుకు వెళ్ళడానికి సిద్ధముగా ఉందాము.

మానవుని జీవితమును భరోసా లేకుండా చేసి నాశనకరమైన మార్గములో నడిపించాలని అపవాది ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాడు. మనము దానిని గ్రహించి వాడి ఆలోచనలను ఎదిరించుచూ ముందుకు వెళ్ళవలసిన వారమై యున్నాము. వాడు అబద్ధికుడు, అబద్ధమునకు జనకుడు అని బైబిల్ గ్రంథములో వ్రాయడం జరిగింది. వాడు కూలదోసిన వారు అనేకులు అందుకే పౌలు భక్తుడు మనము సాతాను తంత్రములను ఎరుగని వారము కాదు అని చెప్పుచున్నాడు. మీలో ప్రతి ఒక్కరూ వాడి తంత్రములను ఎరిగి జీవించాలని కోరుకొనుచున్నాను. అదే సమయములో మన దేవుడు, రక్షకుడు అయిన ప్రభువు మనలను అనుదినము ప్రోత్సాహపరుస్తూ, జీవితం యెడల గురి కలిగి ముందుకి వెళ్ళడం నేర్పిస్తాడు. నిరీక్షణ వలన ఆయన సహాయమును పొందుచు, జయముతో ముందుకు వెళ్ళేవారిగా ఉందాము. కాబట్టి మనలను మన కుటుంబమును పోషించువాడు, ఆరోగ్యముతో నడిపించువాడు ఆయన ఒక్కడే. అంత మాత్రమే కాకుండా జీవిత కాలమంతా కావలసిన ప్రతి అవసరతను తీర్చువాడు ఆయనే.

దీనిని చదువుతున్న ప్రతి ఒక్కరు ఏదియు తక్కువ కాకుండా జీవించును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 5 | సంచిక: 2

జనవరి - ఫిబ్రవరి, 2017

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- "నీ మార్గములలో తోడు" ..... 2
- మీకు తెలుసా? ..... 5
- వెనుదిరుగకు (స్త్రీల ప్రత్యేకం) ..... 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 50వ భాగము ..... 10
- మనస్సాక్షి (బాలల శీర్షిక) ..... 12
- నిర్ణయములు ..... 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ..... 14
- ప్రార్థనా వీరునిగా ఉండడం ఎలా? ..... 16
- ప్రార్థనా కూడికలు ..... 19
- ప్రార్థనా శక్తి ..... 20
- బైబిల్ క్విజ్-50 ..... 22
- జన్మదిన శుభాకాంక్షలు ..... 23


మా చిరునామా :

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227

# “నీ మార్గములలో తోడు”

- బ్రదర్. ఎపఫ్రా

**నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును. - యెహో 1:9**



క్రొత్త సంవత్సరము నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకోవడంతో ప్రారంభమై, రకరకాల పరిస్థితుల ద్వారా సంవత్సరాంతములోనికి చేరుకుంటాము. ఏది యేమైనా జీవితకాలచక్రం తిరిగిపోతూ ఉంటుంది. సంవత్సరములు జరుగుతూ ఉండగా దేవుని కార్యములు నూతన పరచబడాలని మన యెడల దేవుని సంకల్పం. ప్రతి నూతన సంవత్సరపు ప్రారంభములో ఆయన వాక్యమును వాగ్దానముగా పొంది, దానిని విశ్వసించి నెరవేర్పు పొందుట దేవుని ప్రజలలో అనేకులకు ఆనవాయితీగా వస్తున్న విషయం. అదే విధంగా మనము కూడా గత సంవత్సరములలో ఆయన వాగ్దానములను ధ్యానించుకుంటూ వస్తున్నాము. 2017వ సంవత్సరము కొరకు ఆయన అనుగ్రహముగా మనము పొందిన వాగ్దానము **“నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును. - యెహో 1:9”**

బైబిల్ గ్రంథములో ఈ వాగ్దానము మోషే పరిచారకుడైన యెహోషువతో చెప్పబడినది. మానవుని బలహీనతను చూచిన దేవుడు అనేక సమయములలో తన మాటల ద్వారా ధైర్యపరచడం జరిగింది. అదే రీతిగా గొప్ప నాయకుడైన మోషే మృతి చెందిన తరువాత లక్షల మంది ప్రజలను నడిపించవలసిన బాధ్యతను దేవుని వలన పొందిన యెహోషువ భయపడి, దిగులు చెందినట్లు మనకు అర్థము అవుతున్నది. అందుకే దిగులుపడకుము జడియకుము అని చెప్పుచూ, అతని మార్గములన్నింటిలో తోడై ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది. ఆ మాటను బట్టి అతడు తన ముందు ఉన్న ప్రయాణమంతటిని ఎంతో విజయవంతముగా కొనసాగించినట్లుగా మనకు అర్థము అవుతున్నది. అంతేకాక దేవుడు తోడై ఉండడం ద్వారా సూర్యచంద్రులను ఒక్క దినమంతా ఆపివేసి, చరిత్రలో గొప్ప




కార్యమునకు నాంది పలకడం జరిగింది. యోర్దాను నదిలో నీళ్ళు ఏకరాశిగా నిలవడం జరిగింది. ఆయన తోడైయుండడం ద్వారా ఎన్నెన్ని కార్యములు జరుగుతాయో మనము గమనించవచ్చు.

మనము ఈ వాగ్దానమును మన జీవితముల కొరకు అన్వయించుకొనినట్లైతే, ఆయన తోడై యుంటే చేయలేని కార్యము అనేది ఏమీ ఉండదు. వాగ్దానములు ఎన్ని ఉన్నవో అన్నియు అవును అన్నట్లుగానే ఉన్నవి. ఆయన మనకు తోడై యుండుట గొప్ప ధన్యత. అనేకులకు ఈ విషయములో సరియైన విశ్వాసం లేదు. అందుకే ఎన్ని వాగ్దానములు తమ విశ్వాస జీవితములో దేవుని వలన పొందినప్పటికి ఎటువంటి ప్రయోజనము లేనివారిగా మిగిలిపోతూ ఉంటారు. మనలో ప్రతి ఒక్కరి జీవితములో అన్ని మార్గములలో ఆయన సహాయకుడు, నిన్న, నేడు నిరంతరము ఒక్కటే రీతిగా ఉన్నవాడు. అపవాది మనుష్యులకు దేవుని మాటల యెడల నమ్మకమును పోగొట్టి, కూల్చడానికి ప్రయత్నము చేయడం అతిసాధారణం. వాడు ఆ ప్రయత్నములో ఎందరినో మ్రింగివేసి ఉన్నాడు. కాని కొందరు వాడి తంత్రములను గ్రహించి, ప్రతిదినము ఆయన మాటను జ్ఞాపకం చేసుకుంటూ ఎంతో బలముతో ముందుకి కొనసాగుతూ ఉంటారు. వారు సాధించలేనిది అంటూ ఏమీ ఉండదు. వారు వెలుగుతున్న నక్షత్రముల వలె దేవునికి మహిమకరంగా ప్రతి స్థలములో ఉంటారు. వారు లోకమునకు వెలుగు, లోకమునకు ఉప్పు, వారి ద్వారా దేవుని నామము మహిమపరచబడుతూ ఉంటుంది.ఒకానొక సందర్భములో నూతన నిబంధనా కాలములో అపో.పౌలు ఈ వాగ్దానము ద్వారా ప్రోత్సాహము పొందడం జరిగింది. అపోస్తలుల కార్యముల గ్రంథము 18:10 వచనములో **"నేను నీకు తోడైయున్నాను నీకు హాని చేయుటకు ఎవడును నీ యొద్దకు రాడు"** అని చెప్పడం జరిగింది. దేవుని సువార్తను గూర్చి పౌలు మాట్లాడుతున్న క్రమములో కొందరు ఎదిరించి దూషించారు. అప్పుడు దేవుడు నేను నీకు

తోడైయున్నానని బలపరచడం జరిగింది. మనము ఆయన తోడైయున్నాడని మరిచిన ప్రతి సందర్భములో ఆయన మనకు జ్ఞాపకం చేస్తూ ఉంటాడు.

కాబట్టి స్పర్శ పాఠకులైన ప్రతి ఒక్కరు దేవుని వాగ్దానమును ప్రతి దినము జ్ఞాపకం తెచ్చుకొని, దానిని ధ్యానించి, ఆ దినము ప్రారంభించిన యెడల మనకి అది ఎంతో జయకరముగా ఉండును. ఆయన మనకు మార్గములన్నింటిలో తోడైయున్నాడనే సంగతి ఎంతో ధైర్యమును కలిగిస్తుంది. నూతన ఉత్సాహముతో ఉంటాము. చేయునదంతా సఫలము అవుతుంది.

ఈ సంవత్సరము ప్రతి కుటుంబములోను, ఈ కార్యములన్నియు దేవుడు జరిగించును గాక అని నేను పలుకుతున్నాను.

మీరు విశ్వసించినట్లే మీకు కలుగును అని చెప్పిన దేవుని మాట నెరవేరును గాక !

అట్టి ధన్యత ప్రభువు వలన కలుగును గాక !

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# మీకు తెలుసా?



టెలివిజన్ కనుగొన్నది " JOHN LOGIE BAIRD. (1888–1946). ఈయన తండ్రి పాస్టర్. ఈయన తన తండ్రి కోరిక మేరకు స్కాట్లాండ్‌లోని "హెలన్స్ బర్గ్" అను ప్రాంతంలో పాస్టర్ గా దేవుని పని చేసేవాడు. అయితే జె.ఎల్. బయర్డ్ చిన్నప్పటి నుండి ఏదో ఒకటి సాధించాలని, క్రొత్తదాన్ని కనిపెట్టాలని ఆరాటపడేవాడు. అయితే అతని తండ్రి యిట్టి కార్యములను ప్రోత్సహించలేదు. ఎక్కడ లోకంలోపడి "దేవుని పనికి" దూరం అవుతాడో అనే కారణం చేత ఎటువంటి సహకారం యివ్వలేదు.

అయితే University of Glassgow లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పాస్ చేసుకొన్న జె.ఎల్.బయర్డ్ ఒక పక్క దేవుని సేవ చేస్తూనే ప్రపంచ ప్రజలకు ప్రయోజనకరమగునట్లు తాను చదువుకున్న చదువుని బట్టి ఏదైనా కొత్తది కనిపెట్టాలని, గొప్ప వ్యక్తిగా రాణించాలన్న తీవ్రమైన దాహంతో ఉండేవాడు. అలా ఒక రోజు తన కోరికను తన అక్క **యానీ** కి తెలియచేసాడు. "అక్కయ్య నేను ఏదో ఒకటి కనిపెట్టాలనుకుంటున్నాను. అది ప్రపంచ ప్రజలందరికి ఉపయోగపడాలని నాకొక మంచి ఆలోచన ఇవ్వమని" అడిగాడు.

అందుకు అతని సహోదరి ఈలాగు ప్రశ్నించింది. బయర్డ్, గత వారం నాన్నగారు వాక్యం బోధిస్తున్నప్పుడు "అంత్య దినములలో పరలోకంలో నుండి ఇద్దరు వ్యక్తులు వస్తారని వారిని క్రూరమృగము చంపుతుందని, అప్పుడు ప్రపంచ ప్రజలందరూ వారి శవములను చూసి సంతోషించి, ఉత్సహిస్తారని చెప్పారు. యిదెలా సాధ్యము? వారి శవములు జెరుసలేములో ఉంటే ప్రపంచ ప్రజలందరూ ఎలా చూస్తారని ప్రశ్నించింది.

జె.ఎల్ బయర్డ్ అప్పటికే దేవుని సేవ చేస్తుండటంతో అతనికి బైబిల్ గురించి తెలుసు కనుక అతని సహోదరి ఆ ప్రశ్న వేయగానే అతనికి బైబిల్‌లోని ప్రకటన గ్రంథం గుర్తొచ్చింది. **"మరియు ప్రజలకును, వంశములకును, ఆ యా భాషలు మాటలాడువారికిని, జనములకును సంబంధించినవారు మూడు దినములన్నర వారి శవములను చూచుచు వారి శవములను సమాధిలో పెట్టనియ్యరు. ఈ యిద్దరు ప్రవక్తలు భూనివాసులను బాధించినందున భూనివాసులు వారి గతి చూచి సంతోషించుచు, ఉత్సహించుచు, ఒకనికొకడు కట్నములు పంపుకొందురు." - ప్రకటన 11:9-10**

నిజమే జెరుసలేము సంత వీధిలో పడి ఉన్న ఆ శవములను లండన్‌లోని ప్రజలు, ఇండియాలోని ప్రజలు, స్కాట్లాండ్ మరియు ఇలా ప్రపంచ భూనివాసులు అందరు చూడాలంటే టెలివిజన్ ద్వారానే సాధ్యం అని నిర్ణయించుకొన్న జె.ఎల్.బయర్డ్ అప్పటి నుండి టెలివిజన్ కనిపెట్టడానికి ప్రయత్నించాడు. కొన్ని సార్లు ప్రయోగాలలో విఫలం అయినా చివరకు 1928లో టెలివిజన్ కనిపెట్టాడు. ఈరోజు మనం ప్రపంచ వార్తలను మన కంటి ముందు చూడగలుగుతున్నాము అంటే జె.ఎల్ బయర్డే కారణం. తన అక్క యిచ్చిన సలహా మేరకు దేవుని వాక్యం మీద విశ్వాసంతో టెలివిజన్ కనిపెట్టుటకు ప్రయత్నం చేసి విజయం సాధించాడు.

క్రీ.శ 95లో టెలివిజన్స్ లేవు, రేడియోలు లేవు, కరెంట్ లేదు. ఇంత టెక్నాలజీ అసలు లేనేలేదు. కాని "యెహోవా" ప్రకటన గ్రంథములో ఆ ఇద్దరు శవములను ప్రపంచ ప్రజలందరూ చూస్తారని ఎలా రాసాడు? ఎందుకనగా రాసింది యోహానే అయినా రాయించింది దేవుడు. దేవుడు సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి కనుక దేవునికి ముందుగానే తెలుసు. మానవుని జ్ఞానం పెరుగుతుందని టెలివిజన్‌ను కనుగొంటారని. అందుకే దేవుడు తన పరిశుద్ధ గ్రంథంలో జెరుసలేము సంతవీధిలో పడి వున్న ఆ ఇద్దరు వ్యక్తుల శవములను ప్రపంచ ప్రజలందరూ చూస్తారని టెలివిజన్ కనిపెట్టక ముందే 1800 సంవత్సరాల క్రితమే రాయించాడు.

నేడు మానవుడు తన జ్ఞానం ద్వారా కనిపెడుతున్నవన్ని కూడా బైబిల్ మరింత సత్యం అని బైబిల్ దైవగ్రంథం అని నిర్ధారణ చేస్తున్నాయి. హల్లెలూయ.

బైబిలు వాక్యాధారంతో టెలివిజన్ కనుగొన్న జె.ఎల్ బయర్డ్.

Invented Television with proof of bible.

సమస్త మహిమ దేవునికే కలుగును గాక ! ఆమెన్ !


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

**అందరూ ఆహ్వానితులే....!**

**వివరములకు:**

**9666666249 | 040-24202227**

# వెనుదిరుగకు

- సిస్టర్ విజయ

**లోతు భార్యను జ్ఞాపకము చేసుకొనుడి లూకా 17:32**

దేవుని నామములో స్త్రీల భాగం చదువుతున్న మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రభువు తన శిష్యులతో మాట్లాడుతూ లోతు భార్యను జ్ఞాపకం చేసుకోమని చెప్పారు. ఆయన ఆలాగు చెప్పడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి మనలో ఏ ఒక్కరమూ ఆయన మార్గములో నుండి తప్పిపోకూడదని. ఎంతో మందికి దీవెనకరంగా ఉండవలసిన లోతు భార్య జీవితమునే నష్టపరచుకోవడం జరిగింది. దేవుని సంకల్పం నుండి దూరమై శాశ్వత జీవమును విడిచి పెట్టింది. ఆమె ఇలాంటి పరిస్థితిలోనికి వెళ్ళడానికి గల కారణములను మనము ధ్యానించుకుందాం.

**తినుచూ, త్రాగుచున్న కాలము**

లోతు అతని భార్య జీవించిన కాలములో జనులు తినుటకు, త్రాగుటకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని మనకి అర్థమవుచున్నది. తినుట, త్రాగుట జీవించడానికే అయ్యి ఉండాలి కానీ తినుటకు, త్రాగుటకే బ్రదకకూడదు. ఆనాటి నుంటి నేటి వరకు ఎందరో జీవితార్థము తెలియకుండానే బ్రదకడమనేది శోచనీయమైన విషయం.

**కొనుచూ, అమ్ముచున్న కాలము**

Trading అనే మాటకి వర్తకము అని అర్థము. వర్తకము అనే మాటని వాడుక భాషలో కొనుచూ, అమ్ముచుండుట అని అనవచ్చును. నేడు ఈ కార్యక్రమం ఎంతో విస్తరించి ఉంది. దేశాల ఎల్లలు సైతము చెరిపివేసి వర్తకము విస్తారముగా విస్తరించియున్నది. దీని ద్వారా మిలియనీర్స్‌గా, బిలియనీర్స్‌గా మారిన వారు ఎందరో ఉన్నారు. కోటాను కోట్ల వ్యాపారము వర్తకము ద్వారానే జరుగుతుంది. నేటికి నాటికి వర్తక విధానములో మార్పు ఉన్నప్పటికి మనుష్యులు కొనుట, అమ్ముట విషయంలో ఎంతో తొందరపడుతూ ముందుకు వెళ్తున్నారనేది వాస్తవం. లోతు దినములలో కూడా కొనుచూ, అమ్ముచూ ప్రజలు ఉన్నారని బైబిల్ గ్రంథంలో వ్రాయబడి యుండడం దీని యొక్క తీవ్రతకు అద్దం పడుతుంది.

**నారు నాటుచూ, ఇండ్లు కట్టుచూ**

మనుష్యులు విలువైన జీవితమును గురించిన అర్థమును మార్చివేసి, జీవించడానికి అవసరమైన వాటిని జీవితముగా భావిస్తున్నారు. పంటలు పండించుకొనుట, గృహములను

అనగా ఇండ్లను కట్టుకొనుట అనేవి జీవించడానికి అవసరమై ఉండగా, అవే జీవితం అని అనుకుంటూ జీవితకాల మంతటిని వాటి కొరకే వ్యయపరచడం చాలా దుఃఖకరమైన విషయం. కొందరిని మనం గమనిస్తే, జీవితమునకు ఎంతో అర్థవంతమైన మానవ సంబంధములను, దైవసంబంధములను, ఏ మాత్రం పట్టించుకొనకుండా పంటలు పండించుటలో ఇండ్లు కట్టుకొనుటలో బిజీ బిజీగా ఉంటారు. లోతు దినములలో కూడా ఇలాంటి ప్రవర్తనతోనే జనులు ఉండేవారని చరిత్ర మనకు చెప్పుచున్నది.

తినుచూ, త్రాగుచూ, కొనుచూ, అమ్ముచూ, నారునాటుచూ, ఇండ్లు కట్టుకొనుచూ విస్తారమైన పనులలో సొదొమ, గొమొఱ్ఱా పట్టణ ప్రజలు ఉన్నప్పుడు దేవుడు పంపిన దూతలు ఆ పట్టణంలో నివసిస్తున్న లోతు దగ్గరకు వెళ్ళి, ఈ పట్టణమును దేవుడు నాశనం చేయబోవుచున్నాడు, మీరు బయటకు వెళ్ళండి అని తెలియపరిచారు. లోతు వెళ్ళి తన కుమార్తెలను వివాహమాడు అల్లుళ్ళకు ఈ సంగతిని తెలియపరచగా వారు ఇతనిని ఎగతాళి చేయడం జరిగింది. అప్పుడు దేవుని దూతలు, లోతు అతని భార్య, ఇద్దరు కుమార్తెలను ఆ పట్టణం నుండి బయటకు తీసుకొని వచ్చి వెనుకకు చూడవద్దు పారిపొమ్మని చెప్పారు. లోతు తన కుటుంబమంతటితో వెళ్ళి పోతుండగా లోతు భార్య వెనుకకు తిరిగి చూచింది. వెంటనే ఉప్పు స్థంభంగా మారిపోయింది.



ఆమె అలా మారడానికి గల కారణం ఆలోచిస్తే తాను విడిచి వచ్చిన పట్టణం మీద మమకారం, మనసులో దాని మీద ఉన్న ఆశ పోలేదు. అందుకే కొంత దూరం వచ్చిన తరువాత వెనుకకు తిరిగి చూడకుండా ఉండలేకపోయింది. నేడు దేవుడు మనలను లోకములోనుండి బయటకు తీసుకువచ్చి అనగా లోక ఆచారములు, పద్ధతులు, ఆడంబరములలో నుండి విడిపించి, నడిపిస్తూ ఉండగా లోకములో జీవించుచున్న అనేకులను చూచి విడిచిన వాటిని తిరిగి చూడాలి అని ఆశించడం శోచనీయమైన విషయం. నేటి దినములలో మనము లోకము, లోకాశలతో కొట్టబడుచూ జీవితములో దేవుని కంటే ఎక్కువగా స్వంత ఇష్టమును నెరవేర్చుకొనుచూ జీవించడం ఏమాత్రం క్షేమము కాదు.

లోతు భార్య జ్ఞాపకం మన జీవితమును గొప్ప మలుపు త్రిప్పేదిగా ఉండాలి. ఈ లోకం నుండి దేవుడు ప్రత్యేకపరచి, పరలోకపు ప్రయాణంలో మనలను నడిపిస్తూ ఉండగా, ఎల్లప్పుడూ వెనుక ఉన్నవాటిని మరచి ముందున్న వాటికొరకై వేగిరపడవలెను (ఫిలిప్పీ 3:13). వెనుకకు చూచుట అనగా పాత సంగతులను జ్ఞాపకం తెచ్చుకుంటూ పాత జీవితం మీద మమకారం కలిగియుండుట. వాటి నుండి విడిపించబడి, దేవుడు మనలను నడిపించిన మార్గములో ముందుకి వెళ్ళడానికి ఇష్టపడదాము.

ప్రియమైన సహోదరీ! జీవితములో ప్రభువు చూపించిన మార్గములో ప్రయాణించడానికి నిర్ణయించుకున్న నీవు ఎన్నడూ వెనుదిరిగి చూడకు. పరిస్థితులు మనలను ఎంత ఇబ్బంది పెట్టినా, లోకం ఎంత తొందర చేసినా ఆఖరి శ్వాస వరకు ఆయనతోనే ముందుకి సాగిపోవాలి. యేసయ్య ఒకరోజు తన శిష్యులతో "నాగటి మీద చెయ్యి పెట్టి వెనుక తట్టు చూచువాడు నా రాజ్యమునకు పాత్రుడు కాదు లూకా 9:62 అని అన్నారు. దీనిని బట్టి బ్రదుకు దినములన్నిటా వెనుకకు చూడకూడదని అర్థమవుతుంది. వెనుదిరిగి చూడటం వలన ఏమి జరుగుతుందో లోతు భార్యను గమనిస్తే అర్థం చేసుకోవచ్చు.

దేవుడు మిమ్మును ఎన్నడూ వెనుదిరగని వారిగా చేయును గాక! ఆమెన్!

**ఉపవాస ప్రార్థన**

ఉపవాస ప్రార్థన - 2017, **జనవరి 26వ** తేదీ (గురువారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
కావున పాల్గొని దేవుని దీవెనలు పొందగలరు.

వివరములకు:

**9666666249**
**040-24202227**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 50వ భాగము**

ఈ స్వస్థత వార్త దావానంలా వ్యాపించినది. ఇప్పుడు ఇంకా ఎక్కువమంది సుందర్ మీద దృష్టిని నిలుపుచున్నారు. ఆయన బోధలు వినడానికే ఇదంతా అని అనుకుంటే పొరబాటే. సూచకక్రియలు అద్భుతములు చేయు శక్తిగల వానిగా ప్రజలు ఆయనను చూడనారంభించారు. ఇది సుందర్‌ని ఎంతో కలవరపర్చింది. ఆ కుర్రవాడిని స్వస్థపరిచింది నేను కాదని సుందర్ పదే పదే ఖండితంగా చెప్పారు. ప్రార్థనా ఫలితంగా వచ్చిన క్రీస్తు శక్తి మాత్రమే ఈ కుర్రాణ్ణి స్వస్థపర్చినదని మీరు గమనించాలని ఎంత చెప్పినా ప్రజల వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. కాబట్టి చివరిగా సుందర్ ఓ తీర్మానానికి వచ్చాడు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడంలో సుందర్ పొరబాటు చేశాడని కొందరు స్నేహితులు భావించారు.

స్వస్థపరచిన వాడు క్రీస్తు అని ఎంత ప్రయత్నించి చెప్పినా వీరికి నచ్చజెప్పలేకపోవడంతో మరలా స్వస్థత చేయకూడదని నిర్ణయించుకున్నాను. ఇలాంటి మూఢనమ్మకం ప్రజలలో పెరిగి నేను ప్రకటించవలసిన క్రీస్తు సువార్త నుండి వారిని ప్రక్కకి త్రిప్పవేస్తుంది అని చెప్పాడు సుందర్. స్వస్థపరిచే కృపావరం ఆయనకున్నదనేది నిస్సందేహమే గాని యేసుక్రీస్తునందలి విశ్వాసం ద్వారా కలిగే ఆత్మ స్వస్థత నుండి శరీర స్వస్థత వైపుకు, క్రీస్తు వైపుకు కాక, సుందర్‌సింగ్ వైపుకు ప్రజలను త్రిప్పివేస్తుందేమోనన్న భయంతో అప్పటి నుండి ఆ కృపను వినియోగించడం మానివేశాడు సుందర్. ఆ తరువాత కాలంలో ఆయన జీవితమును, సేవను గూర్చి ఆయన స్నేహితుడొకరు మాట్లాడుచూ, స్వస్థతలు చేయనని సుందర్ తీర్మానించడం చాలా విచారకరమని, తానెంతో భక్తితో ప్రేమించిన యేసుప్రభువులా శారీరకంగా శ్రమను అనుభవించే వారిపై సుందర్ కూడా జాలిపడి ఉంటే ప్రజలపై తాను మరింత ప్రభావాన్ని చూపగలిగేవాడన్నారు.

సుందర్ గనుక తన స్నేహితుల సలహాలే పాటించియుంటే క్రైస్తవ సాధువుల కొరకు ఓ తర్ఫీదు కేంద్రాన్ని యేర్పాటు చేసియుండేవాడే. తనకి ఉన్న స్వస్థతా కృపను వాడుకోవడం ద్వారా ఇంకా ఎంతో ఎక్కువ మందిని ఆకర్షించగలిగియుండేవాడే. సుందర్ విషయానికి వస్తే దేవుడు తనకు చూపిస్తున్న మార్గము ఇది అని ఆయన గ్రహించుకున్న

తరువాత మనస్సు మార్చుకోలేదు. గాని అంతకు ముందు వలెనే సువార్త ప్రకటనని ఆయన కొనసాగించారు. ఇతరులకు నేర్పడానికంటే కూడా సువార్త ప్రకటించడం కొరకే దేవుడు ఆయనను పిలిచారు. ఆయన వ్యక్తిత్వము, జీవిత విధానము ఇతరులకు ఎంతో నేర్పించాయనుకోవడం కంటే స్ఫూర్తిదాయకమైనాయంటే బాగుంటుంది.

సిలోన్‌లో సువార్త ప్రచారాన్ని ముగించుకున్న తరువాత పార్కర్ దంపతులతో ఉందామని ఆయన మరల త్రివేండ్రం వెళ్ళారు. తిరువాన్కూరులో స్త్రీల మధ్య తన సేవను కొనసాగించుచున్న రిబ్కాగారు సుందర్ జీవితానుభవములను, ఆయన బోధలను ఆధారంగా చేసికొని ఓ పుస్తకం వ్రాస్తే బాగుండునని తలంచారు. అచటి స్త్రీలు ఇంతకు మునుపే ఆయనను చూచారు. ఆయన ప్రసంగాలు విన్నారు కూడా. వారి మనస్సులపై ఆయన చెరుగని ముద్ర వేశారు. కాబట్టి ఇలాంటి వారి స్వదేశీయుని గూర్చి వారి మాతృభాష మళయాళంలో ఓ పుస్తకం వ్రాస్తే ఎంతో సహాయకరంగాను, స్ఫూర్తిదాయకంగాను ఉంటుందని రిబ్కా భావించారు. దీనికి కావలసిన సమాచారాన్నంతా అందించడానికి సుందర్ అంగీకరించాడు. కాబట్టి సుందర్ తమతో ఉన్న దినములలో తానడిగిన ప్రశ్నలకు సుందర్ ఇచ్చిన జవాబులను, ఆయన జ్ఞాపక స్మృతులను, ఆయన మాటలను ఆమె వ్రాసికుంటూ వారు కొనసాగించిన ఈ పని సుందర్ జీవిత సందేశాన్ని ఎంతో మందికి పంచిపెట్టబోవుచున్నదని వారు కలలో కూడా ఊహించలేదు. ఇది కేవలం స్థానికుల ప్రయోజనం కోసమేనని వారనుకున్నారు. అయితే పార్కర్ గారి స్నేహితులకీ విషయం తెలిసినపుడు దీనిని మలయాళ భాషలో ఉంచడం కంటే ఇంగ్లీషు భాషలో తయారు చేస్తే బాగుంటుందని సూచించారు. కాబట్టి దేవుడు పిలిచిన సాధు సుందర్ సింగ్ అనే పేరుతో 1918లో దానిని ప్రప్రథమంగా ఆంగ్ల భాషలో ముద్రించారు. ప్రథమ ముద్రణలో వచ్చిన పుస్తకాలకు పెద్ద గిరాకీ రావడంతో తరువాత సం॥లో రెండుసార్లు ముద్రించాల్సి వచ్చింది. ఈ రెండవ ముద్రణలో మరికొన్ని క్రొత్త విషయములను దానిలో పొందుపర్చారు. ఆ తరువాత ఇతర భాషల్లోనూ దీన్ని ముద్రించారు. ప్రథమ ముద్రణ జరిగి 50 యేళ్ళైపోయిననూ పంజాబ్‌లో ఓ మారుమూల గ్రామంలో జన్మించిన కుర్రవాడు విశ్వవిఖ్యాతి గలవాడవడానికి ఈ పుస్తకం ఎంతో దోహదం చేసింది.

– సేకరించబడింది (ఇంకా ఉంది)

# మనస్సాక్షి

హలో పిల్లలూ ! హ్యాపీ న్యూ ఇయర్ ! క్రిస్మస్, న్యూ ఇయర్ ఎలా సెలబ్రేట్ చేసుకున్నారు? బాగా ఎంజాయ్ చేశారా? ఈ న్యూ ఇయర్ లో ఏం ప్లాన్స్ వేసుకున్నారు మీ ఫ్యూచర్ గురించి. బాగా చదువుకోవాలని మాత్రం తప్పకుండా అనుకుంటారు కదా ! అలాగే ఒక్క 10ని॥లైనా ప్రేయర్ చేసుకోవాలని మీ షెడ్యూల్‌లో ప్లాన్ చేయండి. అప్పుడు మీకు దేవుడు తోడుగా ఉంటాడు, ఏ భయమూ ఉండదు. ఈ ఇయర్ అంతా దేవుడు మీ స్టడీస్ లో తోడై ఉండాలని, మంచి ఆరోగ్యం ఇవ్వాలని నేను కోరుకుంటున్నానర్రా !!

పిల్లలూ ! మీకు భయము అంటే తెలుసు కదా ! మనము తప్పు చేసినప్పుడు ఎక్కువ భయపడతాము. అది ఎవరికి తెలియకపోయినా మన మనస్సాక్షి మనల్ని భయపెట్టిస్తుంది అది ఎలా అంటే ఈ స్టోరీ చదవండి మీకే అర్థమవుతుంది.

ఒకసారి అక్బర్ మహారాజు ఉంగరం పోయింది. కోట మొత్తం వెదికినా కనిపించలేదు. అప్పుడు అక్బర్ బీర్బల్ను దర్బారుకి పిలిపించి, “బీర్బల్, నా ఉంగరం కనిపించటం లేదు. సేవకులు కోటంతా వెతికారు, అయినా దొరకలేదు. ఎవరో దొంగలించారని నా అనుమానం. దొంగిలించిన వాళ్ళు మన సభలో ఎవరో అయ్యుండాలి, ఎవరో కనిపెట్టగలవా?” అని అడిగారు. బీర్బల్ ఒక నిమిషం ఆలోచించాడు. “ఇది చాలా సులువైన పని మహారాజా! దొంగిలించిన మనిషి గడ్డంలో ఒక బియ్యపుగింజ ఉంటుంది, అందరి గడ్డాలు పరీక్షిస్తే దొంగెవరో ఇట్టే కనిపెట్టొచ్చు!” అన్నాడు.

వెంటనే సభలో ఒక వ్యక్తి తన గడ్డం తడుముకున్నాడు. ఇది చూసిన బీర్బల్ వెంటనే దొంగని పట్టించాడు.

అక్బర్ చాలా ఆశ్చర్యపోయాడు. “బీర్బల్, నీకెలా తెలిసింది, దొంగ గడ్డంలో బియ్యపుగింజ ఉందని?” అని అడిగారు. “మహారాజా, తప్పు చేసిన మనిషి మనస్సాక్షి ఎప్పుడు భయపడుతూ ఉంటుంది. దొంగతనం చెయ్యనివాళ్ళు చుట్టుపక్కల వాళ్ళని చూస్తుంటే, తప్పు చేసిన వాడు తన గడ్డం భయంతో తడుముకున్నాడు” అని బీర్బల్ వివరించాడు.

చూశారా పిల్లలూ, తప్పు చేసినప్పుడు ఎలా భయపడతామో... అందుకేనర్రా ఈ న్యూ ఇయర్ లో మీరు చక్కగా చదువుకుని, ప్రేయర్స్‌లో శ్రద్ధగా ఉండాలని నా మనవి. ఆడుకునే టైంలో ఆడుకోండి, చదువుకునే టైంలో సిన్సియర్‌గా చదువుకోండి. అప్పుడు ఎవరికీ భయపడనక్కరలేదు. ప్రతిరోజు ప్రేయర్ చేసుకోండి. దేవుడు మీకు తోడుగా ఉండి ఈ ఇయర్ అంతా కాపాడుతాడు.

All The Best పిల్లలూ !

ప్రేమతో మీ అక్కయ్య

 అవసరం ఉన్నప్పుడే పలకరిస్తారని ఎవరి గురించి బాధపడకు... ఎందుకంటే వాళ్ళు చీకట్లో ఉన్నప్పుడే వెలుగులా నువ్వు గుర్తొస్తావని సంతోషించు

# నిర్ణయములు

ఓ దేవా !

నిద్రలో ఉన్న నా ఆత్మని తట్టి లేపి, భవిష్యత్‌లో విజయం కొరకు సిద్ధపరుస్తున్నందుకు వందనములు. జీవితములో కలుగుచున్న శోధనలన్నిటి నుండి తప్పించబడి, సవాళ్ళన్నింటిని ధైర్యంగా ఎదుర్కొని, నన్ను నేను సాధకం చేసుకొనునట్లుగా మంచి నిర్ణయములు చేసుకొని, అనుసరించడానికి కృప చూపించు తండ్రీ !

1. ఈ దినము నుండి నా సమయమును సోమరి తనముతో జీవించక, నేను అభివృద్ధి పొందడానికి వచ్చిన ప్రతి అవకాశమును ఉపయోగించుకుంటాను.
2. ఈ దినము నుండి నా వ్యతిరేకమైన ఆలోచనా విధానమును మార్చుకొని, అనుకూలంగా ఆలోచించడం నేర్చుకుంటాను.
3. ఈ దినము నుండి నా నాలుకను స్వాధీనములో ఉంచుకొంటాను.
4. ఈ దినము నుండి నేను కనిన కలలు నెరవేర్చబడాలంటే, నా గమ్యమునకు చేరాలంటే నేను నిరీక్షణ కలిగి ఉంటాను.
5. ఈ దినము నుండి నా భావోద్రేకములను అదుపులో ఉంచుకుంటాను.
6. ఈ దినము నుండి నా వైఫల్యాలను విజయమునకు మెట్లుగా భావిస్తాను.
7. ఈ దినము నుండి నా తోటివారియెడల కపటము లేని ప్రేమను చూపించడానికి మాత్రమే ప్రయత్నిస్తాను.
8. ఈ దినము నుండి ఆత్మనూన్యతా భావముతో నిండి ఉన్న వారి హృదయములను స్నేహ భావము ద్వారా గెలవడానికి ప్రయత్నిస్తాను.
9. ఈ దినము నుండి నేను చేయలేను, నా వలన కాదు, ఇది అసాధ్యము అను నిరీక్షణ లేని మాటలు రాకుండా నా నోటిని కాచుకుంటూ, నీ వలన సమస్తమూ సాధ్యమే అని జీవిస్తాను.
10. ఈ దినము నుండి కష్టించి పనిచేయడం, ప్రార్థించడం, విశ్వాసము, నమ్మకము అనునవి విజయమునకు రహస్యములు అని గ్రహిస్తాను.
11. ఈ దినము నుండి నన్ను ఎంతగానో ప్రేమించుచున్న నా దేవుని సహాయంతో మాత్రమే ప్రతి నిర్ణయం తీసుకుంటాను.
12. ఈ దినము నుండి వీటన్నిటిని చేయడానికి మంచి ఆరోగ్యం నాకు అవసరం కనుక ఆరోగ్యం మీద శ్రద్ధ కలిగి జీవిస్తాను.

# "నా జీవితములో దేవుని మేలులు"

కె.గంగాధర్, శ్రీకాకుళం

నాపేరు కోనేరు గంగాధర్ మాది శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం పలాస దగ్గర తర్లాగడివూరు (గ్రామము). మాది మధ్య తరగతి కుటుంబం, ఒక అన్నయ్య ,అక్క, నేను చిన్నవాడిని. మాది విగ్రహారాధన కుటుంబం. మా నాన్న గారికి నేను 7వ తరగతి చదువుచున్నప్పుడు అనారోగ్యం కలిగింది. చాలా హాస్పిటల్స్ లో ట్రీట్‌మెంట్ చేయించాం కాని మా నాన్నగారు 1988లో మరణించారు. మేము చాలా బాధపడ్డాము. మేము చేసిన పూజలు, విగ్రహాలు మా నాన్నని బ్రతికించలేకపోయాయి. అప్పటి నుండే పూజలు చేయటం, విగ్రహాలకు మ్రొక్కడం మానేసాను. నేను మైగ్రేన్‌తో (తలనొప్పి) బాధపడుచున్నప్పుడు మా ఇంటి ప్రక్కనున్న ఒక సహోదరి చాలా అనారోగ్య పరిస్థితి (లంగ్స్ ప్రాబ్లం )తో బాధపడేది. అయినప్పటికీ దేవునిలో ఎంతో విశ్వాసం, నిరీక్షణతో ఉండేది. నన్ను చర్చికి వచ్చి ప్రార్థన చేసికోమని చెప్పింది. నేను 1992 లో చర్చికి వెళ్ళడం జరిగింది. మారుమనస్సు పొందాను, 02.01.1994 సం॥లో బాప్తిస్మం తీసుకున్నాను. సంఘం లో పరిచర్య చేస్తూ అనేక కూటములకు వెళ్ళేవాడిని. తరువాత ఉద్యోగ ప్రయత్నంలో నేనుండగా మా బంధువులలో ఒక బ్రదర్ రామోజి ఫిల్మ్ సిటీ లో వర్క్ చేస్తున్నాడు. ఆయన ద్వారా 2002లో హైదరాబాద్ వచ్చాను. జాబ్ విషయంలో దేవునికి ప్రార్థించేవాడిని. ఆ ప్రార్థన వలన నాకు రామోజి ఫిల్మ్ సిటీలో ఎలక్ట్రీషియన్ గా జాబ్ వచ్చింది, జాయిన్ అయ్యాను. 21.05.2003లో విగ్రహారాధన కుటుంబంలో అమ్మాయిని వివాహం చేసుకోవడం జరిగింది. నేను మాత్రం ప్రార్థన చేస్తూ బైబిల్ చదువుకునేవాడిని, నా భార్య మరో ప్రక్క విగ్రహారాధన చేసేది. ఒకరోజు డ్యూటి కి వెళ్ళుచున్నప్పుడు బ్రదర్ ఒకరు పరిచయం అయ్యారు. అతను దేవుని గురించి చెప్పినప్పుడు నేను ప్రార్థనకు వెళ్ళేవాడిని ఇప్పుడు వెళ్ళటం లేదని చెప్పాను. భాగ్యలతలో ఎఫ్రాఫా మినిస్ట్రీస్ గురించి చెప్పి నన్ను రమ్మన్నారు, కాని నేను చాలా రోజులు వెళ్ళలేదు. తరువాత ఒక ఆదివారం ఆరాధనకు వెళ్ళాను. ఆరాధనలో దైవసేవకులు చెప్పే వాక్యము, మాటలు, అక్కడ ఉన్న పరిస్థితులు చూచినప్పుడు నాలో ఏదో తెలియని సంతోషం కలిగింది. నేను ఇంతకుముందు వెళ్ళే సంఘాలకి ఈ పరిచర్యకి చాలా వ్యత్యాసం కనిపించింది. అప్పటి నుండి నేను ఎఫ్రాఫా మినిస్ట్రీస్ కి వస్తున్నాను, నా భార్య మాత్రం విగ్రహారాధన చేస్తూ ఉండేది. ఒకరోజు బ్రదర్ భాగ్యలత కాలనీలో గృహ కూడిక ఉంది మీరిద్దరూ రండని చెప్పినప్పుడు మేమిద్దరం వెళ్ళాము. అక్కడ బ్రదర్ చెప్పిన వాక్యము ద్వారా నా భార్య మారుమనస్సు పొంది 2004 ఆగస్టులో బాప్తిస్మము తీసుకున్నది . పరిచర్య ద్వారా రక్షించబడి, అప్పటి నుండి

ఇప్పటి వరకు విన్న వాక్యము ద్వారా విశ్వాసం నిరీక్షణలో కొనసాగుతూ ఉంది. నాకు 2005లో ఒక కుమారుడ్ని 2009 లో ఒక కుమార్తెని దేవుడు అనుగ్రహించారు. ఆర్థికంగా ఇబ్బందులు కలిగినప్పుడు నా భార్య శనివారము జరిగే ఉపవాస ప్రార్థన లో వాక్యము ముగించే సమయములో మీకేదైనా అవసరత ఉంటే కళ్ళముందుకు తెచ్చుకో అన్నప్పుడు జాబ్ రావాలని ఆమె అనుకుంది. అప్పుడు 2006లో రామోజి ఫిల్మ్ సిటిలో నా భార్యకి జాబ్ వచ్చింది. నేను చేసే వర్క్ లో చాలా ఒత్తిడి ఉండేది, ఆ పరిస్థితులనుబట్టి నా జాబ్ రిజైన్ చెయ్యాలని అనుకుని, బ్రదర్ దగ్గరకి వెళ్ళి విషయం చెప్పినప్పుడు బ్రదర్ రిజైన్ చెయ్యొద్దని, ధైర్యంగా ఉండు అంతా దేవుడే చూచుకుంటాడు అని చెప్పి ధైర్యపరిచేవారు. 14.07.2015న డ్యూటి కి వెళ్లాను నేను చేసే వర్క్‌లో నాకు హై వోల్టేజ్ ఎలక్ట్రిక్ షాక్ తగిలింది. ఇక కొన్ని క్షణాల్లో నేను చనిపోతాను అని అనిపించినప్పుడు వెంటనే దేవునికి ప్రార్థించాను, అంత భయంకర పరిస్థితి నుండి దేవుడు నన్ను కాపాడారు. 2015 సం॥లో ఆయన మిమ్మును స్థిరపరచి దుష్టత్వము నుండి కాపాడుదును అనే వాగ్దానం చేశారు ఆ విధంగానే దుష్టుని నుండి నన్ను కాపాడి, సజీవంగా ఉంచారు. ఈ కీడు వలన దేవుడు నాకు ఎన్నో మేలులు చేసారు. డ్యూటిలో నెమ్మదినిచ్చి, ఆత్మీయంగా దేవునిలో చాలా బలపరిచారు. ఆ షాక్ వలన నా శరీరం కాలు భాగం కాలిపోయింది. ఆ గాయం మానటానికి 4నెలలు పట్టింది. ఈ 4నెలలు ఆర్థికంగా ఏ ఇబ్బందులు లేకుండా ఫుల్ సాలరీ వచ్చే విధంగా దేవుడు నాకు సహాయం చేసాడు. నా వారు నాకు దూరంగా ఉన్నా నా పరిచర్యలో ఉన్న వారందరూ నా వారయ్యారు, నాకోసం ప్రార్థనలు చేసారు. ఇంత గొప్ప పరిచర్య ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కుటుంబంలో సంతోషం, నెమ్మది ఎంతో సమాధానం దేవుడు కలుగజేసాడు. పరిచర్యలో దైవసేవకులు చెప్పే వాక్యం చూపించే ప్రేమ, సహోదరులు చూపించే ప్రేమ ద్వారా నిరంతరం దేవుని హత్తుకొని ఈ పరిచర్యలో మేము చివరి వరకు ఉండాలని ప్రార్థించుచున్నాము. నా కుటుంబంలో నా భార్య కుటుంబంలోని వారందరూ దేవుని తెలుసుకునే విధంగా వారి కొరకై మీరందరూ ప్రార్థించగలరు.

నా కుటుంబంలో దేవుడు చేసిన ఈ మేలులు అన్నింటిని బట్టి మరియు నన్ను నా కుటుంబాన్ని సజీవులుగా ఉంచిన దేవునికి నా కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను.

# ప్రార్థనా వీరునిగా ఉండడం ఎలా

మానవుడు సాతానుకు తన అధికారాన్ని అప్పగించేశాడు. సాతాను ఏదేను తోటలోకి ప్రవేశించి, హవ్వను మోసగించి ఆదామును చేరే మార్గం సంపాదించాడని మనకు ఆదికాండం 3వ అధ్యాయం వలన తెలుస్తున్నది. "మరియు ఆదాము మోసపర్చబడలేదు గాని... (1తిమోతి 2:14) ఆదాము దేవుడు తినవద్దని నిషేధించిన పండును తినడానికి నిర్ణయించుకొన్నాడు. "ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో ఆలాగుననే మరణమందరికిని సంప్రాప్తమాయెను. మరణమేలెను (గ్రీకు పదం "బేసిలూయ అంటే ఒక రాజు వలె పరిపాలించడం)" మరణము ఒకని అపరాధ మూలమున వచ్చినదై ఆ యొకని ద్వారానే యేలిన యెడల (రోమా 5:12,14,17). మరణం ఎవరి ద్వారా ఏలిందో "ఆ ఒక్కడు" సాతానే. "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణముయొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయముచేత దాస్యమునకు లోబడివారిని విడిపించుటకను, ఆయన కూడా రక్తమాంసములలో పాలివాడాయెను." (హెబ్రీ 2:14,15).

"మరణం ఎవరి మూలంగా లోకం లోనికి ప్రవేశించి అందరినీ ఏలడం సాధ్యమయ్యిందో వానిని అంటే సాతానును శక్తిహీనుని గానూ, పనికిమాలిన వానిగానూ చేయడానికి యేసు వచ్చాడు." ఎప్పుడైతే ఆదాము హవ్వలు సాతానుని అబద్ధానికి లోబడ్డారో, లేక వశమయ్యారో అప్పుడే వారు సాతానుని అధికారం లోకి వచ్చారు. "లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకుందురో, అది చావు నిమిత్తముగా పాపముకేగాని, నీతి నిమిత్తముగా విధేయతకేగాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా?" (రోమా 6:16) ఆ విధంగా ఆదాము, హవ్వలు దేవుడు తమకిచ్చిన హక్కును - అంటే ఈ భూమి మీద అధికారం చేయగల హక్కును కోల్పోయారు. సాతాను అధికారాన్ని, శక్తిని కైవసం చేసుకొని అది చేజారకుండా బలంగా పట్టుకొన్నాడు.

మరణం యొక్క అధికారం మూలంగా సాతాను ఏలాడు. ఆదాము దేవునికి లోబడి ఉన్నంతవరకు నిత్య జీవాన్ని కలిగి ఉన్నాడు. అది శాశ్వతంగా ఉండేది గనుక అతని అధికారానికి అదనంగా మరింత బలాన్ని చేకూర్చింది. అతడు శాశ్వతమైన జీవం లేక నిత్య జీవపు అధికారం మూలంగా ఏలాడు. దానికి భిన్నంగా ఆదాము పాపము చేసి అందరికి మరణము సంప్రాప్తించడానికి ఎప్పుడైతే కారణమయ్యాడో అప్పుడు సాతాను మరణపు

 ఒకరు నీకు చెడుచేసారని నీవు పదిమందికి చెడు తలపెడితే ఒకరోజు మంచి కూడా చెడు రూపంలో నిన్ను కాటేయగలదు.

ఏలుబడికి ఒక మార్గంగా పనిచేసి రాజ్యం చేశాడు లేక అధికారం చెలాయించాడు. ఈ అధికారాన్ని మానవుణ్ణి భయపెట్టడానికి అతనిలో పిరికితనం పుట్టించడానికి మానవాళి అంతటి మీదా ఆధిపత్యం చెలాయించడానికి సాతాను ఉపయోగించాడు. తన చిత్తాన్ని అనుసరించి బలవంతంగా సమ్మతించేటట్టు చేశాడు. మానవుడు పాపం వల్ల తన ఆధిపత్యాన్ని వదులుకున్నాడు. మానవుడు పాపం చేసినప్పుడు దేవుని పోలిక, రూపం పాడయ్యాయి. దేవునితో అతని సంబంధం తెగిపోయింది.

యేసును శోధించడం సాతానుని అధికారాన్ని రుజువు పరచింది. సిలువ మీద మరణించనవసరం లేకుండానే, ఈ భూమి మీద అధికారం చేయడానికి, రాజ్యమేలడానికి అవకాశమిస్తానని చెప్పడం ద్వారా సాతాను యేసును శోధించాడు. "మరల అపవాది మిగుల ఎత్తైన యొక కొండమీదికి ఆయనను తోడుకొనిపోయి, యీ లోక రాజ్యములన్నిటిని, వాటి మహిమను ఆయనకు చూపి, నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటినన్నిటిని నీకిచ్చెదనని ఆయనతో చెప్పగా" (మత్తయి 4:8,9) ఆ సమయములో యేసుకు ఇవ్వడానికి సాతాను వద్ద ఈ లోక రాజ్యాలు, వాటి మహిమ ఉన్నాయి. యేసు వాడికి సాగిలపడి నమస్కారం చేయాలన్న షరతు మీద అవన్నీ ఆయనకు ఇస్తానని మాట ఇచ్చాడు. సాతానుకు అధికారం చేసే హక్కు ఉందని ఒప్పుకోవడమే అవుతుంది. (పర్యవసానంగా సాతాను ఈనాటికి అన్నింటి మీదా అత్యున్నత అధికారిగా ఉండేవాడు. విధేయుడైన మనుష్య కుమారునిగా, ఆ శోధనను అధిగమించడానికి యేసు ఉన్నత దేవుని వాక్యపు అధికారం మీద పూర్తిగా ఆధారపడవలసి వచ్చింది. మీకూ, నాకూ అందుబాటులో ఉన్న ఆధారాలు కూడా అవే. తద్వారా యేసు ఆ శోధనను అధిగమించి మనకు ఆదర్శమయ్యాడు.

యేసు మానవుని అధికారాన్ని తిరిగి సంపాదించాడు. మానవుడు తన పిలుపు నుండి పడిపోయాడు. అధికార రాజదండం అతని చేతిలోనుండి జారిపోయింది. సాతాను దానిని తీసుకొని క్రీస్తు వచ్చేవరకు తన చేతిలోనే ఉంచుకొన్నాడు. మానవుడు దేన్నైతే సాతానుకు స్వాధీనం చేశాడో దానిని క్రీస్తు రక్షించాడు, విడిపించాడు. ఈ లోకానికి మనుష్యకుమారునిగా రావడం మూలంగా ఆయన ఈ పని సాధించాడు. హెబ్రీ 2:14-16 దీనిని ధృవపరుస్తున్నది. ఆయన దేవుని కుమారునిగా మాత్రమే గాక మనుష్య కుమారునిగా కూడా వచ్చాడు. "కాబట్టి మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణ భయము చేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన కూడా రక్తమాంసములలో పాలివాడాయెను. ఏలయనగా ఆయన ఎంత మాత్రమును దేవదూతల స్వభావమును ధరించుకొనక, అబ్రాహాము సంతాన స్వభావమును ధరించుకొనియున్నాడు" (అంటే-

అధికారాన్ని, ఏలుబడిని సాతాను వద్దనుండి తీసివేసి, దేవుని రూపంలోనూ ఆయన పోలికలోనూ తిరిగి సృష్టించబడిన మానవునికి దానిని తిరిగి ఇవ్వడం).

యేసుక్రీస్తు మానవునిగా ఎందుకు వచ్చాడు? దేవుని కుమారునిగా మాత్రమే ఆయనెందుకు రాలేదు? దాని జవాబు చాలా ప్రాముఖ్యమైనది. ఎందుకంటే ప్రార్థన ఉద్ధేశానికి అది సూటిగా సంబంధించినది. దేవుడు తన చిత్తాన్ని ఉల్లంఘించడు. మానవుని అధికార పరిధిలోకి (మన లోకం) దేవుడు బలవంతంగా ప్రవేశించడు, తాను మానవునికిచ్చిన అధికారాన్ని భంగపరచడు. భూమి మీద అధికారం చేయడానికి, దానిని ఏలడానికి ఆయన మానవుణ్ణి సృష్టించాడు. అందువల్ల ముందుగానే నిశ్చయించిన తన ఉద్ధేశానికి దేవుడు బద్ధుడై ఉన్నాడు. ఆయన తన సొంత చిత్తాన్ని ఉల్లఘించి, మరొకరికి ఇవ్వబడిన రాజ్యంలో అధికారం చూపించడు. ఉదాహరణకు, మీ ఇంటి ప్రక్కన ఉన్న వ్యక్తి ఒక అద్భుతమైన చిత్రకారుడు కావచ్చు. కాని మీ అనుమతి లేకుండా మీ ఇంట్లో తన నైపుణ్యాన్ని, ప్రతిభను చూపే స్వేచ్ఛ అతనికి లేదు. మీ ఇంట్లో మీకే అధికారముంటుంది. ఇతరులు న్యాయంగా మీ ఇంట్లోకి ప్రవేశించాలి అంటే మీరు ఆహ్వానించే దాకా అంటే రమ్మని చెప్పేదాకా ఆగాలి. అదే విధంగా ఒక మానవుడు ప్రార్థనలో రమ్మని ఆహ్వానించనిదే దేవుడు విమోచించబడిన మానవుని భూసంబంధ రాజ్యంలోకి లేక అధికార పరిధిలోకిరాడు. ఈ లోకంలో క్రైస్తవ స్త్రీలకు, పురుషులకు ఒక బాధ్యత ఉంది. దానిని దేవుడు వహించడు. ఒక అధికారముంది. దానిని దేవుడు భంగం చేయడు. "అధికారమిచ్చుట" అనే ఈ సూత్రాన్ని ఆయన అధిగమించలేడు, అధిగమించడు కూడా. "మరియు ఆయన మనుష్యకుమారుడు గనుక తీర్పు తీర్చుటకు (తండ్రి) అధికారము అనుగ్రహించెను" (యోహాను 5:27)



# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2017 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | గురు | 9.00 | భాగ్యలత |
| ఏప్రియల్ | 14 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మే | 01 | సోమ | 9.00 | భాగ్యలత |
| ఆగష్టు | 15 | మంగళ | 9.00 | భాగ్యలత |
| అక్టోబర్ | 02 | సోమ | 9.00 | భాగ్యలత |

**యౌవనస్థుల కూడికలు:-**
ప్రతి నెల 2వ బుధవారం - భాగ్యలత
రాత్రి గం.7.00 లకు
ప్రతి నెల 3వ ఆదివారం - చింతల్
సాయంకాలం గం.5.00 లకు

**స్త్రీల కూడికలు:-**
ప్రతి నెల 1వ బుధవారం - భాగ్యలత
ప్రతి నెల 2వ బుధవారం - చింతల్
రాత్రి గం.7.00 లకు

**పరిచారకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం - భాగ్యలత నందు రాత్రి గం. 7.00 లకు.

## ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీస్ - హాలిడేస్ - 2017

| | | | |
|---|---|---|---|
| జనవరి 1 | న్యూ ఇయర్ | ఆగష్ట్ 15 | స్వాతంత్ర్య దినోత్సవం |
| జనవరి 14 | సంక్రాంతి | ఆగస్టు 25 | వినాయక చవితి |
| జనవరి 26 | రిపబ్లిక్ డే | సెప్టెంబర్ 30 | దసరా |
| మార్చి 29 | ఉగాది | అక్టోబర్ 02 | గాంధీ జయంతి |
| ఏప్రియల్ 14 | గుడ్ ఫ్రై డే | అక్టోబర్ 19 | దీపావళి |
| మే 1 | మేడే | డిసెంబర్ 25 | క్రిస్మస్ |

**"నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును. - యెహోషువ 1:9**

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

మనకు అందుబాటులో ఉన్న సులువైన ప్రార్థనా విధానము బైబిలులోని వాక్యమును లేక లేఖనములను ఉంచి అనగా "దేవా, నీ వాక్యం ఇలా ఉంది, నేను దానిని నమ్ముతున్నాను అని చెప్పుట. ప్రతీ పరిస్థితినందు ప్రార్థించుటకు తగిన వాక్యభాగములను మనము బైబిల్‌నందు చూడగలము.

- మనము గానీ మనము ప్రేమించువారుగానీ రోగిగా ఉన్నప్పుడు, "నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే" నిర్గమ 15:26ను, కీర్తనలు 103:2-4లోని, "నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు నీ సంకటములన్నిటిని కుదుర్చువాడు. సమాధిలోనుండి నీ ప్రాణమును విమోచించుచున్నాడు కరుణాకటాక్షములను నీకు కిరీటముగా ఉంచుచున్నాడు" అని ప్రార్థించవచ్చును.

- మన కష్టసమయములో లేక మన ప్రాణము అలసిపోజేసే పరిస్థితుల ద్వారా వెళ్ళుతున్నప్పుడు యెషయా 40:29,31 లోని "సొమ్మసిల్లిన వారికి బలమిచ్చువాడు ఆయనే శక్తిహీనులకు బలాభివృద్ధి కలుగజేయువాడు ఆయనే" మరియు విలాప 3:22-23 లోని యెహోవా కృపగలవాడు, ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచునది గనుక మనము నిర్మూలము కాకున్నవారము. అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది. నీవు ఎంతైన నమ్మదగినవాడవు." అని ప్రార్థించవచ్చును.

- మన ప్రార్థనలు దేవుడు వింటున్నాడని మనము తెలిసికొనవలసి వచ్చినప్పుడు కీర్తనలు 6:9లోని "యెహోవా నా విన్నపము ఆలకించియున్నాడు. యెహోవా నా ప్రార్థననంగీకరించును." అని ప్రార్థించవచ్చు.

- మన నోరు మనలని సమస్యలలో పడవేస్తున్నప్పుడు కీర్తనలు 141:3 "యెహోవా నా నోటికి కావలియుంచుము నా పెదవుల ద్వారమునకు కాపు పెట్టుము" అని ప్రార్థించవచ్చు.

- మనం భయపడినప్పుడు యెషయా 41:10లోని "భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును అనియు, యెహోషువ 1:9లోని "నిబ్బరము కలిగి ధైర్యముగా ఉండుము దిగులుపడకుము జడియకుము నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును" అనియు ప్రార్థించవచ్చును.

- మనం ఆందోళన కలిగి ఒత్తిడిలో ఉన్నప్పుడు కీర్తనలు 55:22 "నీ భారము యెహోవా మీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును నీతిమంతులను ఆయన ఎన్నడును కదలనియ్యడు"

 తన ఆశలకూ శక్తి సామర్థ్యాలకూ మధ్య ఉన్న అగాధాన్ని అర్థం చేసుకున్నవాడు సుఖపడతాడు.

అనియు యెషయా 26:3లోని “ఎవని మనస్సు నీ మీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతిగలవానిగా కాపాడుదువు, ఏలయనగా అతడు నీయందు విశ్వాసముంచియున్నాడు.

● మనం ఆర్థికంగా బాధపడుతున్నప్పుడు కీర్తనలు 34:9–10లో యెహోవా భక్తులారా ఆయనయందు భయభక్తులు ఉంచుడి, ఆయనయందు భయభక్తులు ఉంచువానికి ఏమియు కొదువలేదు. సింహపు పిల్లలు లేమిగలవై ఆకలిగొనును గాని యెహోవాను ఆశ్రయించు వారికి ఏ మేలు కొదువయై యుండదు” మరియు మనము ఇచ్చుటలో నమ్మకముగా ఉన్నట్లయితే ఫిలిప్పీ 4:19లో “దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును” అని ప్రార్థించవచ్చును.

● మనము ఒక నిర్ణయాన్ని తీసుకొనవలసివుండి ఏమి చేయాలో మనకు అర్థం కానప్పుడు సామెతలు 3:5–6, నీ స్వబుద్ధిని ఆధారము చేసుకొనక నీ పూర్ణహృదయముతో యెహోవా యందు నమ్మకముంచుము నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును”అని ప్రార్థించవచ్చు.

● మన భవిష్యత్తు గురించి నిరుత్సాహపడినప్పుడు యిర్మీయా 31:17లో “రాబోవుకాలమునందు నీకు మేలుకలుగునను నమ్మిక యున్నది, ఇదే యెహోవా వాక్కు, 29:11లో నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములే గాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు” అని ప్రార్థించవచ్చు.

● మన బిడ్డలతో సమస్యలను ఎదురొంటున్నప్పుడు యెషయా 54:13లోని “నీ పిల్లలందరు యెహోవా చేత ఉపదేశమునొందుదురు” అని ప్రార్థించవచ్చు.

● మన జీవితములో దేవుడు ఏమి చేయుచున్నాడో అర్థంకానప్పుడు యెషయా 55:8,9 “నా తలంపులు మీ తలంపుల వంటివి కావు మీ త్రోవలు నా త్రోవల వంటివి కావు ఇదే యెహోవా వాక్కు ఆకాశములు భూమికి పైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గముల కంటే నా మార్గములు మీ తలంపుల కంటే నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి” అని ప్రార్థించవచ్చు.

**దేవుని వాక్యం మన ప్రతి పరిస్థితికి తగిన జవాబును నిర్దేశకత్వాన్ని, ప్రార్థనా వ్యూహాలను ఇస్తుంది.**

– సేకరించబడింది (ఇంకా ఉంది)




# బైబిల్ క్విజ్ -50

(ఎస్తేరు గ్రంథం  నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

1. నూట ఇరవైయేడు సంస్థానాలను పాలించిందెవరు?
2. హిందూ దేశం గురించి ఏ పుస్తకం ప్రస్తావించింది?
3. ఎస్తేరు తండ్రి ఎవరు?
4. "దేవుడు" అనే పదాన్ని వాడని బైబిలు పుస్తకం ఏది?
5. మోకాళ్ళూని హామానుకు నమస్కారం చేయని వ్యక్తి ఎవరు?
6. రాజును హత్య చేయడానికి కుట్ర పన్నిన పాలకులు ఎవరు?
7. తన జాతిని, వంశాన్ని బయలు పరచవద్దని ఎస్తేరుకు ఎవరు సలహా ఇచ్చారు?
8. 'ఎస్తేరు' పేరుకి అర్థం ఏమిటి? ఆమెకి గల మరో పేరేమిటి?
9. మొర్దకైని ఉరి తీయుటకు హామాను చేయించిన ఉరి కొయ్యను గురించి రాజుకి ఎవరు చెప్పారు?
10. రాజుకు లోబడనందుకు రాణి హోదా నుండి ఎవరు తొలగించబడ్డారు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జనవరి 31 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి 2017 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ – స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌టాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070.

**బైబిల్ క్విజ్ – 49 జవాబులు (నెహెమ్యా గ్రంథం నుండి ఇవ్వబడినవి) :**

**1**. తూరు దేశస్థులు (13:16)
**2**. నోవద్యా (6:14)
**3.** నెహెమ్యాతో అర్తహషస్తరాజు (2:2)
**4.** ఎల్యాషీబు (3:1)
**5.** సన్బల్లటు, టోబియా, గెషెము (2:19)
**6.** షల్లూము (3:12)
**7.** షన్బల్లటు (4:1,2)
**8.** హస్సెనాయా వంశస్థులు (3:3)
**9.** షెమయా (6:10,12)
10. 52 దినములు (6:15)

**బైబిల్ క్విజ్ – 49 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**
పాపరమేష్, సుశీల, కృప, వీణ ప్రసన్న

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జనవరి - ఫిబ్రవరి

**భాగ్యలత** : యోహాను, సుధాకర్, సంతోషి, సుజాత, చైత్రికాబిస్వాల్, రవికుమార్ బెన్ని, అభిషేక్, అనిల్‌కుమార్, హానోక్, కిరణ్‌కుమార్, గిఫ్టీషారోన్, నవీన్, రమాదేవి, సుధారాణి, కుమారి, క్రాంతికృష్ణ, అంజి, శ్రీదేవి, శిరీష, పాల్‌ప్రవీణ్, దీవెన, శ్రీధర్, నిర్మల, మంజుల, జోసెఫ్, రాబిన్, బ్యూలా, పూజిత, సౌజన్య, సుస్మిత, సుమతి, తిమోతి, నిహారిక, రమేష్, అశోక్, జ్యోత్స్న, కరుణాకర్‌రాజ్, శ్రీనివాస్, సునీత, ఎస్తేరు, ఉదయ్‌కుమార్, అనిత, రాణి, రాజా, తరుణోదయ్, తేజస్విని, రవి, విజయలక్ష్మి, జ్యోతి, సజీవ్, శ్రీలక్ష్మి, శంకర్, అఖిల్, శ్రావ్య, సత్య, కృపాలత, రగూయేల్, సురేఖ, రాజేష్, సుధీర్, క్వీన్స్‌మెల్కీసెదెక్, చల్లారావు, హర్షిత, మీనా, పాండు, హిమబిందు, వెంకటలక్ష్మి, శైలజ, తులసి, మనోహర్, వెంకన్న, జైన్, నానికుమార్, ఫ్రాన్సిస్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఫీబే, ఉమాశ్రీ, వేణుమాధవ్, ఆనందరావు, వినోద్, జీవన్, దివ్యాంస్, అనూష, ప్రశాంత్, తబిత, తిరుమల, హైమావతి, నవ్యశ్రీ, జ్యోతిర్మయి, అనిలకుమారి, బాపూజీ, రాజ్‌కుమార్, కీర్తన, మణి, తనూషారాణి.

**చింతల్ :** కొర్నేలీ, ప్రకాశ్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, పుష్పలత, జెర్రీరోజ్‌రాయ్, ఉదయ్, రిబ్కా, దానియేల్, జె.యస్.ఎన్.మూర్తి, పవన్‌చందు, హెప్సిబా, అమర్, సువర్ణరాజు, మహిమజ్యోతి, హైమావతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి, సురేఖ, సుధీర్, అఖిల్, రాజేష్

**అనాజ్‌పూర్ :** సువమ్మ, అంకమ్మ, సునీత, మరియ, లక్ష్మి, అమర్‌నాథ్, జాన్‌బీ, కీర్తి

**ఇ.సి.ఐ.యల్ :** జీవా, సజీవ్

**"స్పర్శ"** అనే మన ద్వైమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

2016 డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ ఆరాధనలో పాల్గొనిన దేవుని ప్రజలు



2016 డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ ఆరాధన మరియు జనవరి 1, 2017 నూతన సంవత్సర ఆరాధనలో పాల్గొనిన దేవుని ప్రజలు








# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249

email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras